# మహాదేవుని కల

పొయ్యి భగభగ మండుతోంది. పొయ్యి ముందు మోకాళ్ల మీద తలపెట్టుకొని కూర్చున్నాడు మహదేవ్. అతనికి పొయ్యిమీద ఉడుకుతున్న అన్నం మీద ధ్యాసలేదు. దూరంగా విశాలంగా వ్యాపించిన భూమి- కుడి ఎడమల ఎక్కడికో వ్యాపించిన కొండలు- కొండలమీదుగా మూసుకువస్తున్న వానమబ్బులు- తను తప్ప మరో జీవరాశి లేకుండా అక్కడ నిలబడ్డాడు... వాన.... జిల్లుమనే వాన....

ఫెడేల్న వీపుమీద దెబ్బ పడేసరికి మహదేవ్ ఉలిక్కిపడి లేచి నిలుచున్నాడు.

"నా కడుపున చెడబుట్టినవ్! చావక ఎందుకు బతికినవ్‌రా? నడువ్." మహదేవ్ తండ్రి కిష్టయ్య మరోమారు చెయ్యెత్తాడు.

అప్పటికే పొయ్యి మీది అన్నం మాడి మసిబొగ్గైపోయింది. ఇల్లంతా మాడు వాసన నిండుకున్నది.

"వాన్నేమనకండి! వాడి ఖర్మ అట్లా తగలడింది." దూరంగా మంచంలో పక్షవాతంతో లేవలేకుండా ఉన్న రామక్క.

"వీన్నా నరికి పోగులు పెడుత." కిష్టయ్య పెడీపెడిన గుద్దాడు.

మహదేవ్ దెబ్బలు కాచుకోలేదు. కనీసం ఒక్క మాటన్నా మాట్లాడలేదు.

కిష్టయ్యకు కొట్టి కొట్టి అలుపు వచ్చింది. అదే సమయంలో మహదేవ్‌కు కోపం వచ్చింది. దెబ్బలు తిన్నానన్న స్పృహే లేదు. కల కరిగిపోయిందనే ఆ కోపం. పెద్ద పెద్ద కండ్లు తిప్పుతూ ఇంట్లో నుండి బయటకు వచ్చి అప్పటికే శిథిలమై పడిపోవడానికి సిద్ధంగా ఉన్న మట్టి గోడలను తన్నాడు. ఇంటి వెనుకనున్న మునుగ చెట్టును తన్నాడు.

కిష్టయ్య ఎటూ పాలుపోక అరుగుమీద తలపట్టుకొని కూలబడిపోయాడు.

"ఏం భాగ్యం- నలుగురు కొడుకులు, నలుగురు బిడ్డలు- అందరూ ఎవరిదారి వాళ్లు చూసుకున్నారు. వీడు...." రుద్ధమైన కంఠంతో కిష్టయ్య.

"వాన్నేమనకండి. వాడసలే పిచ్చాడు." రామక్క.

"వానికి పిచ్చా! నీకు పిచ్చే. బ్రాహ్మని కడుపున సుద్దరోడు (శూద్రుడు) పుట్టాడు. నువ్వు వాన్ని నాకు కనలేదే- పల్లెలో ఎవడో సుద్దరోనికి కన్నవ్."

"రామ రామ! అపరాత్రి పూట ఎలాంటి మాటలండీ!" రామక్క వలవల ఏడ్వసాగింది. మహాదేవ్ ఒక పెద్ద బండరాయి ఎత్తుకొని తండ్రిమీద వేయడానికి వచ్చాడు.

"వెయ్యిరా! వెయ్యి! నామీదొకటి – మీ అమ్మ మీదొకటి వేయి. ఆ తరువాత నిన్ను ఎర్రగడ్డ పిచ్చాసుపత్రికి పట్టుకపోతారు." కిష్టయ్య.

పిచ్చాసుపత్రి మాట వినగానే మహాదేవ్ బండరాయిని మునగ చెట్టు దగ్గర పడేసి గజగజ వనికిపోయాడు. అతని కళ్లల్లో చెప్పరాని భయం తొంగిచూసింది. నిలువెల్లా చెమటలు పట్టాయి. "నేను పోను...." అరుస్తూ ఇంట్లో దాక్కోవడానికి మూల మూలకు పరుగెత్తాడు. ఎక్కడా అతనికి రక్షణ ఉన్నట్లు కన్పించలేదు. మట్టి మిద్దె మీదికెక్కి కిటికీలో నుండి వీధిలోకి చూశాడు.... వీధిలో ధోవతులు కట్టుకొని మాట్లాడుకుంటూ వెళ్లేవాళ్లంతా తనకోసమే వస్తున్నట్లుగా భ్రమపడ్డాడు. కాసేపు తలుపు చాటుకు దాక్కున్నాడు.

దూరంగా శంభుని గుడిలో గణగణ గంటలు మోగుతున్నాయి.

మహాదేవ్ తలుపు చాటుకు అట్లాగే ఎంతసేపో కూలబడిపోయాడు.

కాసేపటికి పిచ్చాసుపత్రి స్థానే పూగోబి తోట కన్పించింది... ఒక గంట క్రితం ఏం జరిగిందో పూర్తిగా మరిచిపోయి మట్టి మిద్దెమీద నుండి కిందికి దిగాడు. తండ్రి లేడు. తల్లి ఇంకా ఏడుస్తోంది. అవేవి అతనికి కన్పించలేదు. విన్పించలేదు. తలుపులు తీసుకొని వీధిలోకి వచ్చాడు.

గోబి ఆకులు పచ్చగా నవనవలాడుతున్నాయి. ఆకుల మధ్యలో గోబి పువ్వు తెల్లగా మెరుస్తోంది. గోబి మొక్క కాండం దగ్గర పచ్చపురుగు పాకుతోంది. మహదేవ్ ఇంటి ముందునేగల పాతకాలపు బిల్డింగు మెట్లమీద కూర్చుండి ఆ పురుగును తీసి పారేశాడు. ఆ బిల్డింగ్ ముందునేగల పనకంటి రామన్న అరుగుమీద కూర్చుండి "ఎవరది?" అన్నాడు.

మహాదేవ్ మాట్లాడేలేదు.

"వారీ! మహాదేవ్ ఆ చీకట్లో ఏం చేస్తున్నావురా? ఇలారా" పిలిచాడు.

వీధిలో లైట్లు వెలిగాయి.

మహాదేవ్ వీధిలైటు కిందికి వచ్చాడు.

రామన్న ముక్కు మూసుకున్నాడు.

"ఆ అంగవస్త్రమేమిటి? మాలవాడన్నా కట్టుకుంటాడురా? బ్రాహ్మణ పుటక పుట్టి – యజ్ఞోపవీతము వేసుకొని – ఛ.. ఛ.. చదువురాదాయే– పోనీ కులవిద్య కర్మ కాండ మంత్రం రాదాయె– గాయత్రి ఎరుగువైతివి. సుద్దరోళ్ల కన్న అధ్వాన్నంగా ఒళ్లంతా మట్టి పూసుకొని తిరుగబడ్తివి... మురుగు కాలువలో తిరిగే పందికన్నా అధ్వాన్నంగా ఉంటివి. మీ అన్నయ్యలు, తమ్ముళ్లు మంచిగ నాగపూర్‌లో సర్కారు నౌకర్లు చేసుకోవట్టిరి. మీ చెల్లెళ్లు, అక్కయ్యలు అంత బావుండిరి. మీ నాన్న నీకేం తక్కువ చేశాడురా? నాగపూర్‌లో బ్యాంకులో నౌకరి పెట్టిస్తే ఊడగొట్టుకుంటివి." ఇట్లాగా ఇంకా చాలా చెప్పుక పోయేవాడే. కాని, అతని భారీ కాయానికి

ఆపాటి మాటలకే ఆయాసం వచ్చింది. ఆఖరుగ ఏదో సంస్కృత శ్లోకం చదివి అన్ని జన్మలకన్నా బ్రాహ్మణ పుటక ఉత్తమమైనదని 'థూ' అంటూ ఉమ్మేశాడు.

మహాదేవ్‌కు అతని మాటలు ఒక్కటన్నా చెవికెక్కలేదు. గోబి పువ్వు స్థానే అతనికి పాలు చేపిన చుక్కావు జ్ఞాపకం వచ్చింది. లేగ దానివెనుక కాళ్లచుట్టూ తిరుగుతోంది. ఆవు లేగను దగ్గరికి రానివ్వడం లేదు. "ఛ్చొ ఛ్చొ" ఆవును నుచ్చుకొడుతూ ముందుకు కదిలిపోయాడు. ఆవు ఎటో పోతోంది. మహాదేవ్ "దా... దా... చుక్క చుక్క" అంటూ దానివెంటే పోతున్నాడు.

మహదేవ్‌కు అతి పురాతనమైన ఆ పట్టణం– మట్టి మిద్దెలు అటు ఇటు పిచ్చాపాటి మాట్లాడుకుంటూ తిరిగే మనుషులు ఎవరూ కన్పించడం లేదు. అక్కడ లేని ఆవు, దాని దూడ మాత్రమే కన్పిస్తున్నాయి.

"సుక్క సుక్క.... దా బిడ్డాదా!" నుచ్చుకొడుతూ కాసేపు దుమ్ము నిండిన వీధుల్లో పరుగెత్తాడు. అతని కలల ప్రపంచం నుండి మాయ ఆవు, లేగ మాయమయ్యాయి.

రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది. ఆకాశంలో చుక్కలు మొలుచుకొచ్చాయి. వీధి దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి. అతి పురాతనమైన ఆ ఊరు కాళ్లు చేతులు ఆడని వృద్ధునిలా పడి ఉన్నది. ఆ ఊళ్లో ఎక్కువ భాగం బ్రాహ్మణ కుటుంబాలే– చుట్టుపక్కల అతి కొద్దిగా మాత్రమే ఇతర కులాల ఇళ్లున్నాయి. ఊరుకు తూరుపు భాగంలో బస్టాండ్ వేపు ఇప్పుడిప్పుడే సిమెంటు బిల్డింగులు వచ్చాయి. ఊరు నడిబొడ్డులో అతి పురాతనమైన మట్టి మిద్దెలే ఇప్పటికి చాలా భాగం శిథిలావస్థలో ఉన్నాయి.

మహదేవ్ తను ఎటు పోతున్నాడో? ఎటు పోవాలని బయలుదేరాడో తెలియకుండా వీధిలో నిలుచున్నాడు.

వీధి అరుగుల మీద బాగా తిని, అరగడానికి పిచ్చాపాటి మాట్లాడుకోవడానికి వయసుమళ్లిన వాళ్లు చేరారు.

"నర్సింహారావు సాబ్ ఇప్పుడు మొత్తం సరిచేసి పారేస్తడు. అతగాని ముఖం దైవ స్వరూపం అప్పుడే కనిపెట్టేశా!" సీతారామశాస్త్రిగారు బాగం వక్క నములుతూ....

"నార్త్‌వాళ్లు ఓ పట్టాన పడనిస్తారా?" చంటయ్య చేతిలోని విసనకర్రతో విసురుకుంటూ...

"చాణుక్యుల వారికెంత మేధస్సున్నదో– వీరు అంతకన్న" బొక్కి నోరు రామయ్యగారు.

"మన ఊళ్లో నుంచి రాజకీయంలో చేరినవారు ఢిల్లీదాకా వెల్లిరి. మన ఊరు బాగుపడదయ్యే" లక్ష్మీకాంతరావు విరక్తిగా....

"బాగుపడే యోగం ఉండాలే..."

"ఊరు ఊరంటంగాని ఇక్కడ మనమున్నామా? ప్రవాసాలు బోయివస్తిమి. మన పిల్లలు నౌఖర్ల మీద పోయిరి. ఎవరికి కావాలె ఈ మట్టి మిద్దెలు." విస్సయ్య లేచిపోయాడు.

మహాదేవ్‌కు ఈ మాటలు అర్థం కావు. భాష అసలే అర్థం కాదు. కాళ్లీడుస్తూ వాళ్లముందు నుండి పోబోయాడు.

"ఎవఁరా?" శాస్త్రిగారు.

మహాదేవ్ మాట్లాడ లేదు.

"వాడే మన పల్లె కిష్టయ్యగారి రెండోవాడు.... వాడి అవతారం చూడు బ్రాహ్మణ పుటక పుట్టాల్సిన వాడు కాదు... ఎనమండుగురు సంతానంలో వీడే వ్యర్థుడు" లక్ష్మీకాంతరావు.

మహాదేవ్‌కు ఈ మాట తన గురించేనని అర్థమయ్యింది. కాని అతను ఆ మాటను పట్టించుకోలేదు. పది సంవత్సరాల క్రితమైతే అట్లా మాట్లాడినందుకు లక్ష్మీకాంతరావును తుక్కుతుక్కుగా కొట్టేవాడు. అప్పుడు కండలు తిరిగిన శరీరంతో, నవనవలాడే వయసుతో, రెపరెపలాడే మనసుతో ఉండేవాడు. ఇప్పుడో తోలు ఊగులాడే శరీరం- మొద్దుబారిపోయిన మెదడు. ఏదీ సరీగ నిలవని కలల ప్రపంచం.

మహాదేవ్ అక్కడికి కొద్ది దూరంలోగల హనుమాన్ మందిరం ముందు కూర్చున్నాడు. మందిరంలో ఎవరో రాత్రిపూట ప్రదక్షిణం చేస్తున్నారు. మందిరంలో దీపం వెలుగుతోంది. మందిరం ముందునేగల రావిచెట్టు ఆకులు చిన్నపిల్లలు ఆడుకుంటున్నట్లుగా గాలికి రెపరెపలాడుతున్నాయి.

గుమ్మాలలో కూర్చుండి ఆడవాళ్లు వత్తులు చేసుకుంటూ ఉదయపు పూట వచ్చిన చాణక్య సీరియల్ గురించి మాట్లాడుకుంటున్నారు. తూరుపున బొగడ మీదగల శంభుని గుళ్లో నారాయణ శాస్త్రిగారు పురాణం అలవాటైన గొంతుతో చెప్పుతున్నాడు.

మళ్లీ ఎవరో మహాదేవ్‌ను పరామర్శించారు. మహాదేవ్ అక్కడి నుండి లేచాడు. వెన్నులో నొప్పి కలుగుతున్నట్లనిపించింది. తండ్రి దేనితో కొట్టాడో అర్థం కాలేదు. తడిమి చూసుకున్నాడు. బొబ్బలేచింది. కడుపులో ఆకలి. పొద్దున తినలేదు. మధ్యాహ్నపు ఎండలో ఆరు కిలోమీటర్లు నడిచి వచ్చి అరుగుమీద పడి ఒళ్లు తెలియకుండా నిదురపోయాడు.

మహాదేవ్ పగుళ్లువారిన మెట్లు ఎక్కి శంభుని గుడికి వెనుక భాగం నుండి లోపలికి నడిచాడు. విశాలమైన అరుగుమీద కూర్చున్న నారాయణ శాస్త్రి పురాణంలో రాక్షసుడు ప్రవేశించినట్టుగా గాభరాపడ్డాడు. వత్తులు చేసుకుంటూ పురాణం వింటూ కూర్చున్న బోడ తలల ఆడవాళ్లు అంగవస్త్రము గుండ్లమీదికి సరిచేసుకున్నారు.

వాళ్లట్లా గాభరా పడుతుండగానే మహాదేవ్ గర్భగుడిలోకి ప్రవేశించాడు. కునికిపాట్లు పడుతున్న దీపం ముందు కూర్చున్న పూజారి "మైల బట్టలతో, మైల శరీరంతో వస్తున్నావా? మహాదేవ్ నడువ్" దాదాపుగా కొట్టినంత పనిచేశాడు.

పులిహోర ప్రసాదం కోసం చాచిన చెయ్యి వెనక్కి తీసుకొని ప్రధాన ద్వారం గుండా నిర్మానుష్యమైన వీధిలోకి నడిచాడు.

మహాదేవ్‌కు వాన మబ్బులు ఉరుముతున్నట్టుగా తోచింది. నెత్తిమీద రెండు చేతులు కప్పుకొని పరుగెత్తాడు. అట్లా పది నిమిషాలు పరుగెత్తే సరికి ఊపిరాడలేదు. తీరా చూస్తే తమ్మ చెరువుకట్ట మీది గుడి కన్పించింది. వాన మబ్బులు, ఉరుములు అడుగున పడిపోయాయి. ఏదో ఆలోచిస్తూ ఒక్కొక్క మెట్టే ఎక్కి తమ్మ చెరువు లోపలికి దిగాడు. నీళ్లు దోసిలితో ఎత్తుకొని ముఖం కడుక్కున్నాడు. వాసనగొట్టే ఆ నీళ్లే తాగి గుడి పక్కనేగల రావి చెట్టుకు ఒరిగి కూర్చున్నాడు.

గాలికి వూగే మొక్కజొన్న పెరడు జల్లు – వరి పొలం గొలుసులు విడిచి... ఆకాశంలో కొంగల బారు..... వానకాలంలో అదేపనిగా అరిచే కప్పల బెకబెక– మోటగీరె కిర్రుకిర్రు ధ్వని – ఇట్లాగా అనేక పంటలు, ధ్వనులు సమ్మిలితమై, కలిగాపులగమై – ఒక వింత మైకం కమ్మి అక్కడే ఒరిగిపోయాడు.

❖ ❖ ❖

మహాదేవ్‌కు హఠాత్తుగా మెలుకువ వచ్చింది. చెరువులో చిన్న కప్పలు అరుస్తున్నాయి. ఆకాశంలో చుక్కలు – రాత్రి ఎంతయ్యిందో తెలియదు. తూరుపుకేసి ఆకాశంలో చుక్కలు కొద్దిగా కాంతి విహీనమౌతున్నాయి.

గాలి చల్లగా హాయిగా ఉంది. అనాలోచితంగా చెరువులోకి దిగి ముఖం మీద నీళ్లు పోసుకొని కొన్ని నీళ్లు తాగి ఒడ్డుమీదికొచ్చాడు. అప్పుడే కొంతమంది పాతకాలపు విధవలైన స్త్రీలు రామనామ జపం చేస్తూ రాగి చెంబులు పట్టుకొని ఉత్తరం వైపునగల గోదావరికి స్నానాల కోసం పోతున్నారు.

మహాదేవ్‌కు హఠాత్తుగా బీడి తాగాలన్పించింది. పెద్దపెద్ద అంగలేస్తూ ఊళ్లో నుండి నడిచి వాగుమీది వంతెన దాటి పల్లెదారి పట్టాడు. అతని మెదడునిండా బీడి ఆక్రమించింది.

గుట్ట నుండి కంకర, రాయి తెచ్చే ట్రాక్టర్లు, ఎండాకాలం చేల లెవలింగ్ కోసం పోయే ట్రాక్టర్లు వస్తూ, పోతున్నాయి. అయినా మహాదేవ్‌కు వాటి ధ్యాసే లేదు. మహాదేవ్ వడివడిగా నడుస్తున్నాడు.

మహాదేవ్ అయిదు కిలోమీటర్లు నడిచి పల్లె చేరుకునేసరికి పల్లె లేచింది. చింత చెట్లమీద, వేప చెట్లమీద పక్షులు అదేపనిగా అరుస్తున్నాయి. బీడి ఆకులు సేకరించడానికి అడివికి బయలుదేరే స్త్రీలు ఒకరినొకరు పిలుచుకుంటున్నారు. చుట్టలు కాలుస్తూ పురుషులు ఊరి బయటకు పరుగులు తీస్తున్నారు. గాలికి తాడి చెట్లు మోత పెడుతున్నాయి. గుంటుకలు వీధుల్లో గీరుతూ పోతున్నాయి. పేడ, కసువు పొలాలల్లోకి జేరగొట్టే బళ్లు కిరకిరలాడుతూ పోతున్నాయి. ముసలి ముతక, చిన్న పిల్లలు వాకిల్లూడుస్తున్నారు.

మహాదేవ్‌కు ఆ శబ్దాలు, ఆ సందడి పరిచితమైనట్టుగానే తోచాయి. తాను ఎన్నో సంవత్సరాలు ఒంటరి గదిలో బందిఖానాలో ఉండి స్వేచ్ఛ పొందినట్లుగా అతని అంతరంగం పోటెత్తింది.

తను ఆ పేడబళ్ల వెంట పరుగెత్తుతే, తను గుంటక కొట్టగల్గితే, అట్లా ఆలోచిస్తూ పాతకాలపు భవంతులు దాటి కాపువాడకు చేరుకున్నాడు.

ఒక గుడిసె ముందు నిలబడి "లింగయ్యా ఓరి లింగయ్యా" బిగ్గరగా పిలిచాడు.

"ఎవలయ్యా! మహదేవ్ అయ్యగారా? లింగయ్య సెల్లిపొయ్యి మూడేండ్లయినా నువ్వు మరువకపోతివి" రేగు కంపలా తలరేగిన ఒక స్త్రీ తనలో తాను అనుకుంటూ బయటికి వచ్చి గొంతు గురగురలాడుతుండగా "గింత పొద్దుగాలచ్చినవ్ మారాజా!" అన్నది.

మహాదేవ్ అదేమి పట్టించుకోకుండా "వానకాలం నెత్తిమీదికి వచ్చింది. పెంట పొలంలో పోయద్దా? బండేడ పెట్టిండే" అన్నాడు.

అంత పొద్దున్నే మూడు సంవత్సరాల క్రితం చనిపోయిన తన పెనిమిటిని జ్ఞాపకం చేసిన మహాదేవ్‌ను ఏమనలేక "వారీ! సాంభన్నా" కొడుకును పిలిచింది.

సాంభయ్య కళ్లు నులుపుకుంటూ దడి దగ్గరికి వచ్చాడు. అప్పటికే బై బై అయి మనుషులు కన్పిస్తున్నారు.

"దా! అయ్యగారూ" సాంభయ్య నులకమంచం వాకిట్లో వాల్చాడు. అతని కూతురు బీడి ఆకుల కోసం పోయిన తల్లికోసం ఏడుస్తూ వచ్చి తండ్రి చంకలో చేరింది. తను ఒక పక్క కూర్చున్నాడు. పిల్ల నిదురలోకి జారుకున్నది.

"మీ నాన్న చూస్తివా? ఇప్పటికి నారుకు వడ్లు అలుకలేదు." మహాదేవ్ మంచంలో కూలబడుతూ....

సాంభయ్య అప్పుడే రేకలు వారుతున్న ఆ ప్రాతఃకాలంలో మహాదేవ్ ముఖం చూశాడు. చింపిరి చింపిరిగా పెరిగిన గడ్డం, దవడ ఎముకలు పొడుచుక వచ్చిన ముఖం - పీక్కపోయిన కండ్లు, మాసిపోయిన అంగవస్త్రము, జంధ్యం తప్ప ఒంటిమీద మరేమి లేదు. చీరుకపోయి దుమ్మురేగిన పాదాలు, తోలు ఊగులాడే ఒళ్లు - "ఈ అలిసిపోయిన దేహంగల ఈ మనిషి దేనికోసం వెతుకులాడుతున్నట్లు?" సాంభయ్య తన ఆలోచనల్లో తనున్నాడు.

"ఇదేమన్నా న్యాయమేనా? నువ్వు నలుగురికి చెప్పవల్సిన వానివి" మహాదేవ్.

"ఏదంటరు?" తేరుకొని సాంభయ్య.

"మీ నాయిన వాలకం" మహాదేవ్.

మహాదేవ్‌కు నిజంగా మూడు సంవత్సరాల క్రితమే తన తండ్రి చనిపోయాడని తెలియదా? ఎప్పుడో పది సంవత్సరాల క్రితం తను తండ్రి పాలేరుండగా మహాదేవ్ వ్యవసాయం చేశాడు. అప్పటి జ్ఞాపకాలల్లోనే ఉన్నాడా? అప్పుడు తను చిన్న పిల్లవాడు. ఇప్పుడు తనను గుర్తు పట్టాడంటే ఏమనుకోవాలి? తెలిసి చేస్తున్నాడా? తెలియకనా? మహాదేవ్‌ను ఆ పల్లెలో అందరు పిచ్చివాడే అనుకుంటారు. కాని, మహాదేవ్ తమ ఇంటివాళ్లతో తప్ప ఊళ్లో ఎవరితో మాట్లాడడు.

"బాయికాడ వానకాలం పచ్చ పెసరు వేద్దామనుకుంటున్న- కొట్టం ఉరుస్తున్నది కప్పియ్యాలె... కట్టకింద పొలంల సాంబ మైసూరు పెదుత బావుంటదంటావా?" మహాదేవ్ తన ధోరణిలోనే-

"మహా బేషుగ్గా ఉంటది." సాంభయ్య.

"నువ్వొక్కడివే మహబాగ చెప్పినవ్‌రా! పిన్నాడా! అంత భూమి నాకేం చేస్తది? నీకు రెండెకరాలు పొలం యిస్త దున్నుకో! బటాయి కింద నీ యిష్టం వచ్చినంత యియ్యి. పాలేర్లను నమ్మటానికి వీల్లేదు. మీ నాన్న నేను వ్యవసాయానికి చాలు." సాంభయ్య వీపుమీద మెల్లగా తట్టి నవ్వాడు మహాదేవ్.

సాంభయ్యకు అంత కలిగాపులకంగా విచిత్రంగా ఉన్నది. ఆ పల్లెల్లో గుంటెడు భూమి కూడా మిగులకుండా ఎప్పుడో మహాదేవ్ నాన్నవాళ్లు అమ్ముకున్నారు. కొట్టం కూలిపోయింది! భూమి కొనుక్కున్నవాళ్లు అవి దున్నవద్దని పొలాలల్ల పండి పొర్లాడితే మహాదేవ్ తండ్రి పెడ రెక్కలు విరిచి కట్టేయించి బండిమీద మంతెనకు తీసుకవెళ్లాడు. ఆ తరువాత రెండు సంవత్సరాలు మహాదేవ్‌ను ఎర్రగడ్డ ఆసుపత్రిలో వేసిన తరువాత మనిషి ఈ రూపు దాల్చాడు.

సాంభయ్య, ఎటు పాలుపోక లోపలికి వెళ్లి ఒళ్లో పిల్లను పడుకోబెట్టి బీడీ కట్ట అగ్గిపెట్టె తెచ్చుకున్నాడు.

తనో బీడి ముట్టిచ్చి మహాదేవ్‌కొకటి యిచ్చాడు. మహాదేవ్ బీడి కుతిమీద ఆరు మైళ్లు నడిచివచ్చి చివరకు అంతకన్నా పెద్ద నిషాలో కూరుకుపోయాడు.

"ఎల్లయ్యకు ఎడ్లు లేవు. మల్లయ్యకు బండి లేదు. తెల్లందాక బాడిగెలేనంట- తెల్లారనే లేదు. అయినె నాగలి దున్ని పంటలు బెద్తడు. నువ్వు జూత్తవు... నా ఈపు నాకందది గని మందీపుగోకుత నన్నడట ఎనుకటికెవడో! సాంభయ్య పెంట జారగొట్టవ్‌రా?" సాంభయ్య తల్లి.

మహాదేవ్ బస్సుబ్బస బీడి పీలుస్తున్నాడు.

"నిన్నెట్ల సమఝు చేసుకోవాల్నో తెలుత్త లేదు అయ్యగారూ! నీకు అన్నీ తెలిసే ఇట్లా బతుకుతున్నరో కాదో నాకెరుకలే." సాంభయ్య.

ఆ కంఠస్వరానికి మహాదేవ్ ఉలిక్కిపడ్డాడు. అతని ముఖంలో అప్పుడే ఉదయిస్తున్న సూర్యకాంతి ప్రతిఫలించింది. హఠాత్తుగా మంచంలో నుండి లేచి వీధిలోకి వచ్చాడు.

సాంభయ్య లేచి 'కోడారి' కేసి నడిచి ఎడ్లను తీసుకొచ్చి, సాయంత్రమే ఎరువు నింపి పెట్టిన బండికి కట్టాడు.

మహాదేవ్ చుట్టు పక్కల ఎటు చూడకుండా పల్లె ఆఖరివాడకు నడిచాడు. అక్కడ కాసేపు ఆగాడు. అక్కడ కూలిపోయిన గోడల్లోకి వెళ్లి నిలుచున్నాడు. అక్కడ గతంలో వాళ్ల పశువుల కొట్టం ఉండేది. ఆ కొట్టాన్ని కొనుక్కున్నాయన- దాని పైకప్పు- గోడరాళ్లు పెకలించుకుపోయాడు. ఆ కొట్టం ఉన్నట్టుగానే మహాదేవ్ అందులో తిరిగాడు. ఆ కొట్టం ముందునే గల ఇంటామె బయటకొొచ్చి,

"మీ అన్నలు తమ్ములు ఏడనో బతుకుతుంటే- నువ్వు గీకొట్టాన్ని మరువకపోతివి- ఏ అపరాత్రి బయలెల్లిగింత పొద్దుగాలనే చేరుకున్నవ్ బిడ్డా! నువ్వు బామని పుట్టుక పుట్టాల్సినోనివి కాదు- కాపుదనపు పుటుక పుట్టాల్సినోనివి. అదేపాయె మీ నాయన నీ కోసం ఎకరమంత భూమన్న ఉంచకపాయె. గీ పల్లెల ఏమున్నదని వత్తవ్ బిడ్డా!" అన్నది.

మహాదేవ్ అదేమి పట్టించుకోకుండా – విశాలమైన ప్రహరీగోడ దాటాడు. అందులో కూలీలు కొందరు గుడిసెలు కట్టుకున్నారు.

ప్రహరీగోడ ఆనుకొనే పెద్ద మోట బావున్నది. పాతకాలంలో పెద్దపెద్ద రాళ్లు తెప్పించి కట్టిన బావది. దానికి ఇప్పుడు కరెంటు మోటరున్నది. ఆ బావికింద ఆరెకరాల పెరడిని తలా ఎకరం చొప్పున కొనుక్కున్న వాళ్లు ఆరు భాగాలు చేసుకున్నారు. మోట బావిమీద కాసేపు దిగాలుపడి కూర్చున్నాడు. పెరట్లో దిగి వంకాయ, బీర, బెండ, గోబి లాంటి కూరగాయ మొక్కలున్నట్టే మహాదేవ్ తిరిగాడు. అతనికి గుంటుక కొట్టి ఉన్న ఆ పెరడు పచ్చగా నవనవలాడే కూరగాయల తోటలాగే కన్పించింది. కొంతమంది చెరువునుండి ఒండ్రుమట్టి పెరండ్లకు తోలుతున్నారు. కొంతమంది ఎరువు తోలుతున్నారు.

వాళ్లు ఎవరు అక్కడ లేనట్టే ఎండెక్కేదాకా ఆ పెరట్లో తిరిగాడు మహాదేవ్.

పది సంవత్సరాల క్రితం కూరగాయల పంట పెద్ద ఎత్తున వేసి పండించవచ్చునని, అదీ ఎండకాలంలో కూడా చేయవచ్చునని ఆ పల్లెకు నేర్పింది మహాదేవ్.

మహాదేవ్ పూర్తిగా వ్యవసాయంలో కూరుకుపోవడం అతని తండ్రికి నచ్చలేదు – బ్రాహ్మలు కింది కులాల మాదిరిగా కాయకష్టం చేయడం చెడిపోవడం లాగే అతని తండ్రికి తోచింది. పెళ్లీడు వచ్చినా ఎవరూ అతడికి పిల్లనివ్వలేదు. ఆ పల్లె ఒకప్పుడు అగ్రహారం. మహాదేవ్ తండ్రి మొదట కడు బీదవాడు. ఆ ఊరిలో సగంకన్నా ఎక్కువ భూమి ఇనాముగా పొందిన ఒక బ్రాహ్మడు, తనకు కొడుకులు లేనందున నలుగురు కూతుర్లకు తలాకొంత భూమి యిచ్చాడు. చిన్న కూతురు రామక్క, కొంత వెర్రిది కనుక కిష్టయ్యను ఇల్లరికం తెచ్చుకొని కొంత ఎక్కువ భూమి కట్టబెట్టాడు. ఆ భూమి ఫలసాయం అనుభవించడం తప్ప దానిగురించి కిష్టయ్యకు తెలియదు. తండ్రితో పల్లెకు అప్పుడప్పుడు వచ్చిన మహాదేవ్‌కు వ్యవసాయం వెర్రి అయి కూచున్నది.

తండ్రి, తను ప్రవాసం వెల్లిన నాగపూర్‌లో మహాదేవ్‌కు బాంకులో ప్యూను ఉద్యోగం వేయించాడు. చదువబ్బని మహాదేవ్ ఏపని చేసిన పర్వాలేదుగాని భూమి దున్నవద్దు. మహాదేవ్‌కు అదొక నరకయాతన అయ్యింది. ఆ పట్టణంలో భూమి, వ్యవసాయం కన్పించక తల్లడిల్లిపోయాడు. మూడు సార్లు పారిపోయి ఊరికి వచ్చాడు. అయినా నిర్బంధపు పని తప్పలేదు.

మహాదేవ్ నాగపూర్‌లో కూరగాయల మార్కెట్లు తిర్గడం ఒక వ్యాపకంగా పెట్టుకున్నాడు. ఒకనాడు ఇరువై వేల రూపాయల బ్యాంకు సొమ్ముగల బ్యాగుతో కూరగాయల మార్కెట్లో జొరబడి

పెద్ద పెద్ద గోబిపూలను బేరమాడుతూ కూర్చున్నాడు. ఆ బ్యాగు ఎక్కడో మరిచిపోయాడు. ఉద్యోగం ఊడిపోయింది. మహాదేవ్ మళ్లీ పల్లె చేరుకున్నాడు.

కిష్టయ్య పెద్దకొడుకు ఉద్యోగంలో చేరిపోయాడు. ఎదిగిన ఇద్దరు కూతుర్ల పెళ్లికోసం మహాదేవ్‌కన్నా ఇద్దరు చిన్నవాళ్ల చదువుల కోసం ఏటా పల్లెలోని కొంత భూమి అమ్మసాగిండు.

మహాదేవ్ తండ్రిని కొట్టి, భూమి కొన్నవాళ్లను కొట్టి మట్టిలో బొర్లాడు.

కిష్టయ్య భార్య రామక్క 'వెర్రి' కొడుక్కు వచ్చిందని బలవంతంగా మహాదేవ్‌ను పిచ్చాసుపత్రికి తీసుకపోయాడు.

అక్కడ రెండు సంవత్సరాలు మహాదేవ్ మనిషి ఎంత పెనుగులాడాలో అంత పెనుగులాడాడు. అరుస్తూ పరుగెత్తేవాడు. తనను తానే కొరుక్కునేవాడు. గోడలకేసి తలబాదుకునేవాడు. ఒక అద్భుతమైన, ఆరోగ్యవంతమైన సృష్టికర్త అయిన మనిషిని కొద్దికొద్దిగా ఎట్లా చంపవచ్చునో పిచ్చాసుపత్రిలో అట్లా చంపబడ్డాడు. మనిషి ఒంట్లో నెత్తురు ఇంకిపోయింది. ప్రతిఘటన, కోపం స్థానే ఇట్లా తచ్చాడే మహాదేవ్‌గా తయారయ్యాడు.

మహాదేవ్ కాలుగాలిన పిల్లిలా తిరిగి తిరిగి బాయి దగ్గరికి వచ్చాడు. బాయి గడ్డమీదే పెద్ద మామిడి చెట్టున్నది. ఆ చెట్టు నీడన కూర్చుండకుండా ఎండలో కూర్చున్నాడు. అతనికెందుకో ఏడుపు వస్తోంది.... పోలీసులు 'రైడు' చేసిన ఊరులాగా అతని మెదడునిండా ఎన్నో జ్ఞాపకాలు.

అతనికి అంతా తెలుస్తూనే ఉన్నది. కానీ అర్థం కావడం లేదు. అర్థం చేసుకోవద్దనుకున్నాడు. మనిషి తనకు నచ్చిన పద్ధతిలో ఈ సమాజంలో బతకడం దుర్లభం.... దుర్లభం కాక దుర్లభం. అయినా ఆశ చావదు. పెనుగులాట మానలేదు. తనుచేసిన పోరాటం ఓడిపోయింది. తన బతుకు చావుకన్నా హీనమయ్యింది. ఇలాంటివో! మరెలాంటివో ఆలోచనలు చేస్తూ మహాదేవ్ లేచి నిలుచున్నాడు.

వడివడిగా వరి పొలాల కేసి నడుక సాగించాడు.

షావుకారి కొట్టం దగ్గరి జమ్మి చెట్టుకింద నిలబడిన ఒక ముసలయ్య కళ్లకు చెయ్యడ్డం పెట్టుకొని "ఎవలు నాయనా? ఎండ పొడుగాను, రోని (రోహిణి) కార్తె ఆఖరుకచ్చినా మబ్బు మాయలేదు. ఇయ్యేడు కాలం ముంచేటట్టున్నది." అన్నాడు.

మహాదేవ్ మాట్లాడలేదు. కానీ అతనికి దిగ చెమటలు కారుతున్నాయి. కళ్లకు చీకట్లు కమ్ముతున్నాయి. అతను కూడా జమ్మిచెట్టు కిందికి చేరుకున్నాడు. జమ్మి కాయల కోసం మేకలు చెట్టు కింద అటిటు తిరుగుతున్నాయి.

ఆ ముసలయ్య మహాదేవ్‌ను గుర్తుపట్టాడు.

మహాదేవ్ దుమ్ములో కూలబడిపోయాడు.

"ఏమున్నదని ఈ దిక్కు మల్లె ఊరుసుట్టు తిరుగుతున్నవ్ బిడ్డా! నా ఎరికల మీది బారిసేత. భూములు కరిగిపోయె – ఎడ్లు, గొడ్లు బాయె – కొట్టాలు కూలిపాయె – మీ నాయిన్న బాగున్నడా?" అన్నాడు.

ఆ మాటలు తనకు సంబంధించినవి కానట్టుగా మహాదేవ్ మేకలనే చూస్తు కూర్చున్నాడు.

“గీ ఊళ్లె కోమలి పోరగండ్లు భూములు దున్ని అండ్లేమి మిగలక దేశాలు బట్టి పోయిరి. ఊళ్లె ఉన్నోళ్లకు బతికే కాలం రాకపాయె. అందరేమొ ఊళ్లల్ల బతుకలేక పట్నాలు బడితే నువ్వేమొ గీ పల్లెమీద పానమిడుసుకోవడ్తివి. అయ్యగారు ఇయ్యి కట్టం జేసుక బతికే దినాలుగావు. దాలనబోలన జేసి మందిని ముంచి బతికే కాలం. కూడులేక కుమ్ము లేక రాత్రి పగలు ఎందుకంట కొట్టి పోసుకుంటన్నవ్ మారాజా?” ముసలయ్య గొంతు వనికింది.

మహాదేవ్ మేక పిల్లనొకదాన్ని ఎత్తుకొని ముద్దులాడుతున్నాడు.

“మనుషుల కేమయ్యిందో ఎనుకటి తీర్గలేరు. కాలరీతి బొత్తిలకు తెలువకుంట కావట్టెను” కర్ర పొడుచుకుంటూ గొణుగుతూ ఊరికేసి ముసలయ్య వెళ్లిపోయాడు.

అదే దారిలో నడువని దున్నపోతుల కట్టిన బండి ఇరుసురాగాలు తీస్తుండగా నర్సింహులు అనే రైతు వస్తున్నాడు. “దున్నపోతులాలా! నడుత్తలేరు గదా! నడువకపోతే నాదేం పోతది? మీరే ఎండల సత్తరు. మీరట్లా ఊగుతే ఇడిసి పెడుతడు నర్సిగాడనుకుంటున్నరేందో? మా ఇడ్సిపెడుత - మరి పెంటెవలు జార గొట్టాలె - మరి దబదబ ఆన గొట్టిందనుకో- పెంట పెంట జాగల్నే ఉంటది గదా! నర్సిగాడు నాలుగిద్దెలు ఎక్కువ పండుతె బతుకుతడనే గదా మీ కువారం.” దున్నపోతులతో ఎడతెగని జగడాలాడుతూ పోతున్నాడు.

ఆ బండి వెనుకనే జుట్టు పోస ఎగురుతుండగా దిగ చెమటలు కారుతుండగా ఆనె గాళ్లు ఎగరేసుకుంటూ రామయ్య ఉరికి వస్తున్నాడు.

“ఓ నర్సన్న - కొంప మునిగిందే - మన ఊళ్లకుగ్గ మచ్చింది.” ఎగపోస్తూ... రామయ్య

“రాదు మరి. నెగల బుట్టని కోడి పిల్ల మంచం మూడు సుట్లని పడుసోల్లంత ఎగిరితిరి. తక్కల్లపెల్లిల భూములు పంచిండ్లని మీరు కంచెల పొన్న ఎర్రజెండాలు బెడ్తిరి... మాదుగలు మన్నేలు ఒక్కటేనని పదాలుబాడితిరి.” నర్సింహులు.

“ఓ కాదే - మన వరిమడ్లల్ల టెంటు లేసుకుంటండ్లు.” రామయ్య.

“ఏసుకోరు మరి-”

“నీ యవ్వ! అవ్వతోడు ఆళ్లు నిన్ను తీసుకపొయ్యి కొంకులిరుగ గొట్టనుండె. పిరికెడు పిరికెడు మీసాలు- ఎర్ర కోతుల తీరుగున్నరు. ఆళ్లది మన భాషగాదు. ఏడినుంచో మేకను దెచ్చుకున్నరు. బారెడు బారెడు అంక తుపాకులున్నయి.” ఏదేదో చెప్పుకుంటనే రామయ్య ఊళ్లోకి పరుగెత్తాడు.

నర్సింహులు ముఖంలో కూడ భయం చోటు చేసుకున్నది. బండి మీది నుండి పొలాలకేసి చూద్దమనుకునేసరికే మహాదేవ్ పొలాల దిక్కు పోవడం కన్పించింది.

“బామనోల్ల పోరడుసత్తడు గని. ఓ అయ్యగారు గటెటు పోతండ్లు- సీయార్పీనో గంగరాయో అచ్చిందంట- అటు బోకు ఉత్త పున్నానికి సత్తవు.” కేకేసి చెప్పిండు.

మహాదేవ్ ఒకమారు వెనక్కి తిరిగి చూసి పొలాల కేసి నడుక సాగించాడు.

అప్పటికే ఎరువు తోలబోయిన వాళ్లు చాలామంది గాభరా గాభరాగా ఊరికేసి బండ్లను తరుముకొస్తున్నారు. దాదాపుగా అందరు మహాదేవ్‌ను అటు పోవద్దని చెప్పి చూశారు. కాని ఎవరు చెయ్యిపట్టి వెనక్కి మలుపలేదు.

మహాదేవ్‌కు నీళ్లు లేక పొట్టకొచ్చిన వరిపొలము వాడిపోయినట్టుగా కన్పిస్తోంది. తను వరి దొయ్యల్లో నీళ్లు పెట్టాలి. అదే ఆలోచన.

వరి పొలాలల్లో నుండి పశువులు ఎండకు తాళలేక చెట్ల నీడ కోసం వెతుకుతున్నాయి. వడగాలి షురువయ్యింది.

మహాదేవ్ తాడి చెట్లకింద చేరిన పశువుల మధ్య నుండి వరి ఒడ్లు మీదుగా గతంలోని తమ పొలం దగ్గరికి నడిచాడు. 'గొరిమిడి' ముళ్లు గుచ్చుతున్నా లెక్క చేయకుండా అక్కడక్కడ ఒడ్లకు మట్టికట్టలు వేశాడు. వరిదొయ్యలు నెర్రెలుబాసి ఉన్నాయి. ఒక్క నీటిచుక్కన్నా లేకున్నా అతనికి నీళ్లు పారుతున్నట్టుగానే ఉన్నది. బురదలో నడుస్తున్నట్లుగా అడుగులు పట్టిపట్టి వేస్తూ చెరువు కట్ట దగ్గరికి చేరుకున్నాడు. కట్ట కింద పెద్ద బాయిలో నీళ్లు నాచు పేరి పచ్చగా ఉన్నాయి.

మహాదేవ్ తన దినచర్య ప్రకారంగా ఆ బావిలో దునికి ఈదులాడుతున్నాడు.

ఇంతలోనే తుపాకులెక్కుపెట్టి నలుగురు జవానులు బాయికి నాలుగు పక్కలా నిలుచున్నారు.

హిందీలో బయటకి రమ్మని అరుస్తున్నారు.

నాగపూర్‌లో ఉండి వచ్చాడు గనుక మహాదేవ్‌కు హిందీ బాగా వచ్చు.

"అయ్యయ్యో వరి పొలం తొక్కుతున్నారు." మహాదేవ్ హిందీలోనే.

"బయటకు రారా రాకపోతే కాల్చేస్తం." ఒకరు హిందీలోనే.

మహాదేవ్ ఏమనుకున్నాడో ఏమో ఎదురు చెప్పకుండా బావిలో నుండి ఒడ్డెక్కాడు.

"ఇక్కడికి చూసిపోదామని వచ్చినవా?" ఒక జవాను పెదేల్‌మని మూతిమీద కొట్టాడు.

మహాదేవ్‌కు ఆ దెబ్బ తన తండ్రి కొట్టినట్టుగానే తోచింది. పిచ్చాసుపత్రిలో చేరింది మొదలు దేహమంతా పిండి పిండయ్యేదాక మహాదేవ్ దెబ్బలు తింటూనే ఉన్నాడు. ఈ పది సంవత్సరాల దెబ్బల అనుభవంలో దెబ్బలకు ఏదన్నా మాట్లాడితే ఇంకా ఎక్కువ తాకుతాయని అర్థమయ్యింది. ఏ మాత్రం చలనం లేకుండా నిలుచున్నాడు.

మాసి చిరిగిపోయిన ఒంటి వస్త్రము – ఆ చూపులు, ఆ ఆకారం చూసి వాల్లు ఏమనుకున్నారో ఏమో? వాళ్లు వేసుకున్న టెంటు దగ్గరికి తీసుకుపొయ్యారు.

కుర్చీలో కూర్చున్న టూత్‌బ్రష్ మీసాల ఆఫీసర్‌తో వాళ్లు ఏదో చెప్పారు.

మహాదేవ్ టెంటు దగ్గర పొయ్యిమీద ఉడుకుతున్న అన్నం కేసి చూస్తూ కాళ్లమీద కూర్చున్నాడు.

వాళ్లల్ల వాళ్లే ఏదో మాట్లాడుకుంటుండగానే మహాదేవ్ లేచి తను ఉద్యోగంలో ఉండగా బ్యాంకు మేనేజర్‌కు సలాం చేసినట్టుగా ఆఫీసర్‌కు సలామ్ చేద్దామనుకున్నాడు. వాళ్లు మహాదేవ్ పరుగెత్త గలడేమోననుకున్నారు.

ఇద్దరు సిఆర్‌పి పోలీసులు పరుగెత్తుకొచ్చి పట్టుకున్నారు.

వాళ్లు ఎడాపెడా నాలుగు చరిచి మళ్లీ కూర్చుండబెట్టారు. ఇప్పుడు మహాదేవ్ ఆఫీసర్ కాళ్లముందు కూర్చున్నాడు.

"నీకు హిందీ వస్తుందా?" ఆఫీసర్ హిందీలో.

మహాదేవ్ తలూపాడు. ఇద్దరు జవానులను పిలిచి ఏదో గుసగుస చెప్పాడు. వాల్లు తుపాకులేసుకొని ఊరికేసి నడిచారు. వారివెంట మరో నలుగురు వెళ్లారు.

ఆఫీసర్‌కు మహాదేవ్‌కు ఈ విధంగా సంభాషణ నడిచింది.

"నిన్నెవరు ఇక్కడికి పంపినరు?"

"నేనే పొలానికి నీళ్లు పెడుదామని వచ్చిన. పొలం ఎండిపోతున్నది."

"నీ పేరేంది?"

"మహాదేవ్"

"ఎంత చదువుకున్నవ్?"

"పదో తరగతి ఫేలైన"

"అచ్చా నువ్వు ఏ లీడర్‌తో పని చేస్తున్నవ్?"

మహాదేవ్ మాట్లాడలేదు. ఆ ప్రశ్న మహాదేవ్‌కు అర్థం కాలేదు.

వెనుక నిలుచున్న జవాను వెన్నులో బూటు కాలితో ఒక్క తన్ను తన్నాడు. మహాదేవ్ బొక్కబోర్ల పడ్డాడు. నోట్లనుండి రక్తం కారింది. మరొక జవాను లేపి కూర్చుండబెట్టాడు.

ఇలాంటివేవో అడుగుతూ కొడుతూనే ఉన్నారు. మహాదేవ్ మాటమాటకు భూమి భూమి అంటున్నాడు. మహాదేవ్ శరీరం ఉబ్బిపోయింది. మధ్య మధ్య నీళ్లు త్రాగిస్తూ కొట్టారు. మాట కూడా మాట్లాడలేని స్థితికొచ్చాడు. మహాదేవ్ మూడేళ్ల క్రితం చనిపోయిన లింగయ్య పేరు, అతని కొడుకు సాంభయ్య పేరును మాత్రం ఉచ్చరించగలిగాడు.

ఆ తతంగం అట్లా సాగుతుండగానే సాయంత్రం అయిదున్నర గంటలకు ఊళ్లో పెద్ద మనుషులను జవానులు వెంటబెట్టుక వచ్చారు.

"అయ్యయ్యో! గీనె పిచ్చి అయ్యగారండీ" మాజీ పోలీసు పటేలు హిందీలో చెప్పాడు.

ఆఫీసర్ "పిచ్చోడైతే ఇక్కడికెందుకు వచ్చాడు?" అని అడిగాడు.

"వీళ్లది పదేండ్ల కింద ఇక్కడ ఇరువై ఎకరాల భూముండె – వీళ్ల కుటుంబం మంతెనలున్నది. వీళ్ల అన్నతమ్ములు అందరు మంచి మంచి ఉద్యోగాలు చేసుకుంటున్నరు. ఈనె భూమి దున్నుతనని లేని భూమి కోసం రోజు ఈ పల్లెకు వస్తడు. వాళ్ల కొట్టం పెరడు తిరుక్కొని అగో ఆ బాయికాడి కొచ్చి స్నానం చేసి ఏ రాత్రికో ఇంటికి పోతడు. హైద్రాబాదు ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిల రెండేండ్లున్నడు." మాధవరెడ్డి హిందీలో వివరంగా చెప్పాడు.

మహాదేవ్ కట్లు విప్పారు. పొమ్మన్నారు.

మహాదేవ్ ఎవరి ముఖం చూడలేదు. ఒక్కమాట మాట్లాడలేదు. తూలుతూ నడుస్తున్నాడు. అతని ఒళ్లు హూనమైపోయింది. ఉబ్బిపోయింది. ముఖంలో గాయాలు. అయినా ఆ దేహ బాధకన్నా అతని మనుసులో ఎక్కడో పెద్ద తుఫాను చెలరేగుతోంది.

ఊళ్లో పెద్ద మనుషులు, పోలీసులు ఏదో మాట్లాడుతున్నారు.

కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. నాలుక పిడుచకట్టుకుపోయింది. అడివి నుండి ఊళ్లోకి వచ్చేదారిలో తాడి చెట్టుకింద కూలబడిపోయాడు.

పడమటి కేసి పొద్దుగూకింది. అయినా ఆ ప్రాంతమంతా నెత్తురు ఎగజల్లినట్లుగా ఎర్రగా ఉన్నది.

కాసేపు నిదురపోతే బావుండును.

హఠాత్తుగా తల్లి "మహదేవా! నాయినా నువ్వు అందరి తీరు ఎందుకు బతుకలేక పోతున్నావురా? నా తండ్రీ నీకు అదేం వెర్రిరా?" అంటోంది.

మహాదేవ్ కళ్లు ధారాపాతంగా కారుతున్నాయి. తండ్రి ఏదో తిడుతున్నాడు. పెద్దన్న కొడుతున్నాడు. అనేక ముఖాలు ఒక్కసారే కన్పిస్తున్నాయి.

మహాదేవ్ శక్తినంతా కూడదీసుకొని ఊళ్లోకి నడువసాగిండు.

చీకటి ఊరిమీదికి దాడి చేస్తోంది.

సాంభయ్య తన పక్కనే నిలబడినట్లుగా తోచింది మహాదేవ్‌కు.

"సాంభ. ఓరి సాంభయ్య నువ్వు ఏ పని చెప్పిన చేస్త! నాకో ఎకరం భూమి యిప్పియ్యవా? అందులో నాగలి దున్నుత- పంటలు దీస్త- అచ్చం నాగపూర్ మార్కెట్లో చూసినటువంటి గోబి పూలు పండిస్త-" మహాదేవ్ సొలుగుతూ పలవరిస్తూ నడుస్తున్నాడు.

మహాదేవ్ ఒళ్లు స్వాధీనం తప్పుతోంది. షావుకారి పశువుల కొట్టం దగ్గర జమ్మి చెట్టు కింద దబెల్లున పడిపోయాడు.

"నేను పిచ్చొన్ని కాదుర సాంభా! నువ్వన్న నన్ను గుర్తుపట్టవా? నేను భూమిని దున్నుత - పంటలు దీస్త" మహాదేవ్ గొణుగుతున్నాడు.

అతని ఒళ్లు వేడెక్కింది. జ్వరంతో సలసల కాగిపోతోంది.

రాత్రి నిర్దయగా ఆ ఊరిమీద పాకింది. మహాదేవ్ అస్తవ్యస్తమైన తెగిపోయే కలలతో జమ్మిచెట్టు కింద దుమ్ములో పడి ఉన్నాడు.

మహాద్భుతమైన మనిషి, ఆరోగ్యవంతమైన మనిషి, మట్టి నుండి పచ్చటి మొక్కలు, పంటలు - సర్వ సంపదలు సృష్టించదలచుకున్న మనిషి మహాదేవ్ సకల కలలను, సర్వశక్తులను హరించిందెవరు? ఈ విధ్వంసం ఎప్పుడు? ఎక్కడ? ఎట్లా ఆరంభమయ్యింది? ఎప్పుడు అంతమౌతుంది?

❄

శ్వేత రాత్రులు సంకలనం, 1993